క్లుప్తంగా

సామాజిక తనిఖీ ప్రారంభం

శిరివెళ్ల: మండలంలో శనివారం ఉపాధి పథకం సామాజిక తనిఖీ మొదలైంది. 2022–23లో జరిగిన పనులుపై తనిఖీలు జరుగుతున్నాయి. మండలంలో పనులకు సంబంధించి కూలీలు, మెటీరియల్‌కు రూ.5.22 కోట్లు ఖర్చు చేశారు. డీఆర్పీలు గ్రామాల్లో తిరుగుతూ కూలీల వేత నాలు, పనుల నాణ్యతను పరిశీలిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలోని వివిధ మండలాలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం నియమించడం జరిగింది. ఆళ్లగడ్డ మండలం అధ్యక్షుడిగా బొల్లపు వంశీ శ్రీనివాసరెడ్డి, ఆళ్లగడ్డ టౌన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, చాగలమర్రి మహబూబ్ షరీఫ్, దొర్నిపాడు పైడాల విష్ణువర్ధన్‌రెడ్డి, రుద్రవరం కుమ్మరి మధుసూదన్, శిరివెళ్ల జాకీర్, ఉయ్యాలవాడ మండల అధ్యక్షుడిగా హుసేనయ్యను నియమించారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న మెప్మా అధికారి విజయభాస్కర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): మహిళల అభ్యున్నతికి రుణాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందని మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జగజ్జననీ నగర్‌లో శ్రీలక్ష్మీ ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల) గ్రూపు సభ్యురాలు అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడరీ వర్క్స్ షాపును కౌన్సిలర్ పురందర్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. పీఎంఈజీపీ సహకారంతో రూ.4.5లక్షలతో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసి, కుట్లు, అల్లికల ద్వారా మరో ఐదుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తామని నిర్వహకురాలు అనిత పేర్కొన్నారు.


బీమా తక్షణ సాయం పంపిణీ

చాగలమర్రి: స్థానిక 2వ సచివాలయ పరిధిలోని 7వ వార్డుకు చెందిన అక్కమ్మగారి సుబ్బయ్య (48) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను గ్రామ సర్పంచ్ తులసమ్మ, ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి శనివారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. ఎంపీటీసీ ఎం.ఫయాజ్, వార్డు సభ్యులు షరీఫ్, మన్సూర్, వెల్ఫేర్ సహాయకులు బాలు, సచివాలయ కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

దొర్నిపాడు: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ప్రజలకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు కేటాయించిన క్లస్టర్ మ్యాపింగ్ ప్రకారమే రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ ఇవ్వకుండా వాటికి బదులుగా నగదు ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వాటిని ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 1–17వ తేదీ వరకు తప్పనిసరిగా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే ఎండీయూ ఆపరేటర్లు గ్రామాల్లో కేటాయించిన లోకేషన్లలో మాత్రమే రేషన్ ఇవ్వాలని చెప్పారు.

మానవాళి రక్షణకే క్రీస్తు జననం



క్రిస్మస్ కేక్‌కట్ చేస్తున్న డీఆర్‌ఓ, మత పెద్దలు

నంద్యాల(అర్బన్): మానవాళిని రక్షించేందుకు ఏసుక్రీస్తు జన్మించాడని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో శుక్రవారం రాత్రి హోలీ క్రిస్మస్ సందర్భంగా హైటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ పవిత్రమైన పండుగ అన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ కార్యదర్శి కారు రవికుమార్ మాట్లాడారు. ఏపీ జెన్‌కో డైరెక్టర్ శశికళారెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి సబీహాపర్వీన్, డీపీఓ మంజులవాణి, సలోమి గుడ్‌షపర్డ్ స్కూల్ కరెస్పాండెంట్ జెస్సీపాల్, పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏసుదాసు పాల్గొన్నారు.

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామ బర్డ్స్ పాఠశాలలో శనివారం కరస్పాండెంట్ పాల్‌రాజారావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను విద్యార్థులు వివిధ వేషధారణలో నిర్వహించిన నాటిక ఆకట్టుకుంది.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్‌ను నియమించాలి

నంద్యాల(అర్బన్): పశుసంవర్ధక శాఖకు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్‌జీవీఎఫ్ చైర్మన్ వెంకటేశ్వర్లు కోరారు. ఐఏఎస్ అధికారితో శాఖలోని అన్ని స్థాయి ఉద్యోగులకు సమన్యాయం జరుగుతుందన్నారు. స్థానిక ఏపీ ఎన్‌జీఓ హోంలో నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్ల ఎన్‌జీవీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



బాలాజీ కాంప్లెక్స్‌లో లక్ష తులసీదళ అలంకారంలో స్వామి వారు



గోస్పాడులో వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు



మద్దూరులో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న అధికారులు

వైకుంఠవాసుడి దర్శనం..పాపహరణం

- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తజనం
- కిక్కిరిసిన వైష్ణవాలయాలు
- పలు చోట్ల స్వామి, అమ్మవార్లకు కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్దిలేటి శ్రీలక్ష్మీ నరసింహస్వామి



బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి



గుడిపాటిగడ్డలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి..



నూనెపల్లె లో వేంకటేశ్వరస్వామి అలంకారంలో వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని వైష్ణవ ఆలయాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి. శనివారం ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారం ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకోవడానికి క్యూలు కట్టారు. సంజీవనగర్‌రామాలయం, గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర, తెలుగుపేటలోని శ్రీలక్ష్మీమద్దిలేటి, కోటావీధిలోని శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి ఆలయాలు, బైర్మల్‌వీధిలోని ఉత్తరాధి మఠం, బాలాజీ కాంప్లెక్స్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో, రోజాకుంట రోడ్డులోని నాగలింగేశ్వర దేవాలయాల్లో స్వామి వారిని పుష్పాలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. అలాగే ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి దర్శించుకున్నారు.

→ సంజీవనగర్ రామాలయంలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామికి ఉదయాన్నే ఉత్సవ మూర్తులకు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, సహస్రనామాలు, స్నపనతిరుమంజనం, గోడంబి, ఎండుద్రాక్ష, బాదం, పిస్తా తదితర వాటితో అభిషేకాలు నిర్వహించారు. దేవాలయంలో మకర తోరణాలతో ఉత్తర ద్వార దర్శనం, పూలతోరణం ప్రత్యేక వస్త్రాలంకరణ సేవ, ప్రత్యేక పూలంగి సేవ, లడ్డుపడి సేవ, ఉత్సవమూర్తులకు అలంకార సేవలు నిర్వహించి స్వామి వారిని విశేషాలంకరణలో పవిత్రాలతో (ఊలు) భక్తులకు దర్శనమిచ్చారు. 45వేల మంది దర్శించుకున్నారని భగవత్ సేవా సమాజ్ అధ్యక్షుడు సూరయ్య, శ్రీనివాసులు, మధు తెలిపారు. సాయంత్రం స్వామి వారికి గ్రామోత్సవం, ఆలయ ప్రాకారంలో పల్లకీసేవ జరిపించారు. శ్రీఆంజనేయ భక్త మండలి మహిళలచే అఖండ భజన కార్యక్రమం చేపట్టారు.

→ గుడిపాటిగడ్డ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి ఉదయమే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ గావించారు. కృష్ణామాచారి, ప్రహ్లాదాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి మహా మంగళ హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి స్వామి వారిని దర్శించుకున్నారు. దాదాపు 30వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

→ బాలాజీ కల్యాణ మండపంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి స్వామి వారిని తమలపాకులచే ప్రత్యేక అలంకరణ, మూలవిరాట్‌కు గవ్వలు, నత్తచిప్పలు, వక్కలతో అలంకరించారు.

→ బైర్మల్ వీధిలోని ఉత్తరాధి మఠంలో సుధీంద్రాచార్యుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, హోమాలు, సహస్ర నామార్చనలు, మంత్రపుష్పం, మహామంగళ హారతులు చేపట్టారు.

– మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లక్షతులసీ అర్చన జరిపించారు. నూనెపల్లె వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని వేంకటేశ్వర స్వామిగా అలంకరించారు.

→ శ్రీనివాసనగర్‌లోని జగన్నాథ మందిరంలో నవదీప్ నరసింహదాసు ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. జగన్నాథ బలదేవ సుభద్రలను ప్రత్యేకంగా అలంకరించారు.

→ గోస్పాడులోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో తెల్లవారుజామునే స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో స్వామి అమ్మవార్లను ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకరటేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారు జామున అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలు కోలాటం నిర్వహించారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహ్మా స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు.



రుద్రవరంలో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఇంజేడులో శ్రీ లక్ష్మివేంకటేశ్వరస్వామి కల్యాణంలో భాగంగా తాళిని చూపుతున్న పండితులు



వేడుకను తిలకిస్తున్న భక్తులు



దొర్నిపాడులో మాధవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



యర్రగుంట్ల గీతా మందిరంలో భక్తులకు అన్నదానం

కనులపండువగా కోనేటిరాయుడి కల్యాణం

ఉయ్యాలవాడ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఇంజేడు గ్రామంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శనివారం కోనేటిరాయుడి కల్యాణం కనుల పండువగా జరిగింది. అర్చకులు రమణయ్య, అనంతయ్య ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు గ్రామంతో పాటు మాయలూరు, పడిగెపాడు, కొండుపల్లె, ఉయ్యాలవాడ, పెద్ద యమ్మనూరు, రూపనగుడి, ఆర్.పాంపల్లె, తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు. మండలంలోని ఇంజేడు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ, హరివరం, బోడెమ్మనూరు గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరిస్వామి, శ్రీ వీరభద్రస్వామి, రామలింగేశ్వరస్వామి, చెన్నకేశవ ఆలయాలకు తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారా దర్శనానికి భక్తులు పోటెత్తారు.

దొర్నిపాడు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని ఆలయాల్లో ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేశారు. మాధవస్వామి ఆలయంలో శ్రీదేవి ,భూదేవి సహిత శ్రీ మాధవస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు ఇంద్రగంటి శశికాంత్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామంలో ఉత్తర ముఖద్వారంతో స్వయంభువుగా వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారిని శనివారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగాగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయం తెల్లవారు జాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. ఆళ్లగడ్డ సీఐ హనుమంతు నాయక్, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి స్వామిని దర్శించుకున్నారు.

శిరివెళ్ల: మండలంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. శిరివెళ్ల, గోవిందపల్లె, యర్రగుంట్ల, మహదేవపురం, బోయలకుంట్ల, కోటపాడు ఆలయాలలో ఉత్తరం ద్వారం ఏర్పాటు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అహోబిలేశుడికి భక్తుల నీరాజనం

- గోవింద నామస్మరణతో మారుమోగిన నల్లమల



ఉత్తరద్వారంలోని యాగశాలలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు



దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: కలిలో శ్రీ అహోబిలేశుడి సన్నిదిలో.. వైకుంఠమే కనిపించెలే.. ఇలలో కోవెలలో... ఇంద్రభోగమగుపించలే.. అన్నట్లు శ్రీమద్ అహోబిల క్షేత్రం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఇల వైకుంఠాన్ని తలపించింది. ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాలు శనివారం భక్తకోటితో పులకించాయి.. వేకువజాము వేళ భక్తుల గోవింద నాసమస్మరణలు.. పండితుల వేద మంత్రోచ్చారణలు.. మంగళవాయిద్యాల నడుమ ఉభయ దేవేరులతో అహోబిలేశుడు ఉత్తర ద్వారం నుంచి దర్శన భాగ్యం కల్పించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచే అహోబిల క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అర్ధరాత్రి అనంతరం ఆలయ ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులను కొలువుంచి విశేషంగా అలకరించారు. తెల్లవారుజామున 3 గంటలకు అహోబిలం మఠం పీఠాధిపతి ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకునేందుకు రాగా ప్రధానార్చకులు కిడాంబీ వేణుగోపాలన్ స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారాలు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించారు.

→ గరుడ వాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు..

ఉత్తరద్వార దర్శనం సమయం ముగిసిన అనంతరం మధ్యాహ్నం ప్రహ్లాదవరదుడు ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై ఆశీనుడై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కరుణించారు. అనంతరం ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి నవకళశ స్థాపన, అభిషేకం, తిరుమంజనం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ హనుమంత నాయక్ బందోబస్తును పర్యవేక్షించారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం



రుద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



3కే రన్‌ను ప్రారంభిస్తున్న షేక్ మాబున్నిసా

రుద్రవరం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రవీంద్రప్రసాదు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యలయం నుంచి శనివారం వారు వివిధ శాఖల సిబ్బంది, కేజీబీవీ విద్యార్థులతో కలిసి గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి క్రీడల పోటీలు మొదలవుతాయన్నారు. ఎంఈఓ శ్రీలక్ష్మి,ఏపీఓ ప్రతాప్,ఎంపీపీ బాలస్వామి, నాయకులు బ్రహ్మం,ఉపాధి,గృహనిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

→ ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడలు

ఉయ్యాలవాడ : గ్రామీణ స్థాయిలో వివిధ రకాల క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారిని వెలికితీసి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సచివాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. హెచ్‌ఎం కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేసు పాల్గొన్నారు.

దొర్నిపాడు:ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. నమోదు చేసుకున్న క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి టెక్కే మార్కెట్ యార్డు వరకు మున్సిపల్ అధికారులు మారథాన్ 3కే రన్ ర్యాలీ నిర్వహించారు. శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ షేక్‌మాబున్నిసా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టామన్నారు. వైస్ చైర్మన్ పాంశావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ మధుకుమార్ పాల్గొన్నారు.

చాగలమర్రి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించటానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో ర్యాలీని నిర్వహించినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీని పాత బస్టాండు నుంచి గాంధీ సెంటర్, మెయిన్ బజార్, పెద్ద మకానం మీదుగా వైఎస్సార్ కూడలి వరకు నిర్వహించారు. వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, కో–ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, ఎంపీటీసీ ఎం.ఫయాజ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక



శ్రీకాంత్

గోస్పాడు: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన పి.శ్రీకాంత్, గోస్పాడు వీర ప్రతాప్ ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో శ్రీకాంత్ సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. తండ్రి పుల్లయ్య, తల్లి లక్ష్మీదేవి. తండ్రి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీకాంత్ 1– 4 వరకు జిల్లెల్లలో, 6 నుంచి 10వ తరగతి వరకు పత్తికొండలోని గురుకుల పాఠశాల, ఇంటర్ ఏపీఆర్‌జేసీ హిందూపూర్‌లో, బీకాం డిగ్రీ ఎస్వీ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేశారు. ప్రత్యేక శిక్షణ పొంది మొదటి సారి ఎంపికలోనే ఫోర్త్ జోన్‌లో రెండవ ర్యాంకు సాధించారు.

అమ్మ కృషి ఫలితమే ఉద్యోగం...



వీరప్రతాప్

గోస్పాడు వీరప్రతాప్ ఏపీఎస్పీ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. తండ్రి మరణించగా తల్లి వెంకటలక్ష్మి కుండల వ్యాపారం చేసి కుమారుడిని చదివించింది. వీరప్రతాప్ 1 – 5 వరకు జిల్లెల్లలో, 6 – 10 వరకు పత్తికొండ గురుకుల పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ నంద్యాల పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో చదివారు. స్వతహాగా మొదటి ప్రయత్నంలోనే ఎంపిక కావడం ఆనందంగా ఉందని, అమ్మ కృషి ఫలితమేనని సంతోషం వ్యక్తం చేశారు.

కోవిడ్ మాక్ డ్రిల్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం కోవిడ్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కరోనా సోకిన వ్యక్తులకు సకాలంలో అందించాల్సిన వైద్య సహకారం, వైద్య సహాయం అందిస్తున్న వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు.

వైద్యసేవలు సక్రమంగా అందించండి



అలమూరు పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

రుద్రవరం: వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఆలమూరు పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. కంటి అద్దాల పంపిణీ, ఎల్‌సీడీసీ సర్వే, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు వంటి వాటిపై సిబ్బందితో సమీక్షించారు. ఎంఎల్‌హెచ్‌పీ,ఏఎన్‌ఎంలు,ఆశా వర్కర్లు వివిధ ఆరోగ్య కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ముకుందాపురంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను పరిశీలించారు. వైద్యాధికారి గాయిత్రి ఉన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ




సైకిళ్ల పంపిణీని ప్రారంభిస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని దీబగుంట్ల హైస్కూల్‌లో శనివారం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు సైకిళ్లను ఎంఈఓ అబ్దుల్‌కరీం ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ హరినారాయణ అందజేశారు. పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. హరినారాయణ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న 85 మంది విద్యార్థులకు రూ.7లక్షల విలువైన సైకిళ్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం నాగలక్ష్మి, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీలను సస్పెండ్ చేయడం సరికాదు

నంద్యాల (వ్యవసాయం): పార్లమెంట్‌లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని ప్రజాస్వామ్య లౌకిక ఐక్య వేదిక కన్వీనర్ అబులైజ్, కో కన్వీనర్ మస్తాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక క్రాంతి రేఖ గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలకు జవాబుదారిగా ఉండాలన్నారు. పార్లమెంట్‌లో బిల్లులను చర్చలేకుండా మూజువాణి ఓటుతో పాస్ చేస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలు ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయన్నారు. జమాతే ఇస్లామీ అధ్యక్షుడు అబ్దుల్ సమద్, ఉలేమా, మౌలానా, ఖలీల్, అహ్మద్, మస్తాన్ వలి, బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బ్రహ్మంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బ్రహ్మం రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం తెలిపారు. ఈనెల 14న యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో 100 మీటర్ల పరుగుపందెంలో ప్రతిభ చూపి ఈనెల 29 నుంచి జనవరి 1వ తేదీ వరకు తమిళనాడు స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

చాగలమర్రి: ఈ నెల 22న విజయవాడలో ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జానపద నృత్య పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థిణులు ప్రథమ స్థానం దక్కించుకున్నారని ప్రిన్సిపల్ సునీత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పాత్ర పోషణ పోటీల్లో 9వ తరగతి విద్యార్థినులు రమాదేవి, నాగవేణి, హరిత, 8వ తరగతి విద్యార్థిని ప్రియాంక మొదటి స్థానం కైవసం చేసుకున్నారన్నారు. అలాగే జానపద నృత్యాల్లో 9వ తరగతి విద్యార్థినులు రమ్యాబాయి, కీర్తనబాయి, రజితాబాయి, 8వ తరగతి విద్యార్థిని శివజ్యోతిబాయి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పాత్ర పోషణలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థినులు జనవరి 3 నుం,ఇ 6వ తేది వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.



చాగలమర్రిలో కేజీబీవీ విద్యార్థినులను అభినందిస్తున్న హేమారాణి

ఘనంగా రైతు దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత, రవీంద్రనాథ్ తెలిపారు.విద్యార్థులు రైతు గొప్పతనాన్ని వివరిస్తూ నాటిక ప్రదర్శించారు. అలాగే.. పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.